# ప్రమాదం

అరవై మైళ్ల దూరం ఎక్కడా ఆగకుండా వచ్చాడేమో, సత్యం కాళ్లు గుదుళ్లు పట్టేశాయి. ఓ కప్పు టీ తాగి, పది నిమిషాల పాటు విశ్రాంతి తీసుకొంటేనే కాని లాభం లేదనుకొని, ముంతపాలెం వంతెన దగ్గర లారీని ఆపుచేసి, క్రిందకు దిగి, పక్కనే ఉన్న చిన్న పాకలోకి వెళ్ళాడు. మెతక వాసన వేస్తున్న రెండు బెంచీలు - వాటి ముందు నల్లగా మట్టి పేరుకుపోయిన రెండు బల్లలు. విరిగిపోయి బోటుపెట్టిన కుర్చీలో కూర్చుని ముందరున్న చిన్న బల్ల మీద గల్లా పెట్టె మీద ఆనుకొని, కునికిపాట్లు తీస్తున్న రంగసామి తప్ప మరెవరూ లేరు లోపల. సత్యం రంగసామి భుజాన్ని తట్టి లేపాడు.

"ఎవరు?" అంటూ ఉలిక్కిపడి లేచిన రంగసామిని చూసి నవ్వుతూ, "ఏమిటలా బెంబేలు పడిచూస్తున్నావు? ప్రొహిబిషన్ వాళ్ళనుకొని బెదిరిపోయినట్టుంది - నీ వాలకం చూస్తే! నేను సత్యాన్ని - ఓ గుక్కెడు నీళ్లు పడేయ్. నేను మళ్లా త్వరగా పోవాలి" అన్నాడు సత్యం.

రంగసామికి దగ్గరగా ఉన్న బెంచీ మీద కూలబడ్డాడు చెమట తుడుచుకుంటూ.

"ఏవిటిలా పగలప్పుడు బయలుదేరావు?" రంగసామి లేచి, బద్ధకంగా వళ్లు విరుచుకొంటూ అడిగాడు. సమాధానం కోసం ఎదురుచూడకుండానే "పోలాయ్" అని గట్టిగా కేకేశాడు. పాక వెనక వైపున దూరంగా పొలంగట్టుమీద, మామిడి చెట్టు చల్లదనాన్ని అనుభవిస్తున్న పోలాయ్, రంగసామి కేక విని, పరుగెత్తుకుంటూ పాక లోపలికి వచ్చాడు.

"ఎక్కడకు పోయావురా? త్వరగా పాలు వేడి చేసి, మంచి టీలు రెండు పట్రా. ఈలోపల ఓ ప్లేటు పకోడీలియ్యి" పోలాయ్‌కి పని పురమాయించిన తర్వాత, నెమ్మదిగా కుర్చీలో కూర్చున్నాడు రంగసామి.

కాస్త స్థిమితపడ్డ సత్యం అన్నాడు: "ఏం, పగలప్పుడు మా లారీలు నడిస్తే నీ రాత్రి వ్యాపారం సగం పడిపోతుందన్న భయమా ఏమిటి?"

"ఏం వ్యాపారంలెద్దూ, కత్తి మీద సాములా నడుస్తోంది. ఈ ప్రొహిబిషన్ వాళ్లతో పడలేక చస్తున్నానుకో. మరోవైపు మీతో పాట్లు! మొన్న రాత్రి సుందరంగాడి లారీ క్లీనరు పెద్ద రెంచి పట్టుకొని మీదకురికాడు. తాగిన సరుక్కి డబ్బులిమ్మంటేను! పోలాయ్ అడ్డు పడకపోతే బుర్ర బద్దలయ్యేది. సుందరంగాడు గొణుక్కుంటూ వాడి డబ్బులు కూడా యిచ్చి, జబ్బట్టుకొని లాక్కుపోయాడు. ఇలాంటి గొడవలతో విసుగెత్తిపోయింది. ఆ వ్యాపారాన్ని ఎత్తేద్దామనుకొంటున్నాను."

పోలాయ్ గ్లాసుడు నీళ్ళు, ఓ ప్లేటు పకోడీలు తీసికొచ్చి సత్యం ముందు పెట్టి టీ

చేసే ప్రయత్నంలో మునిగిపోయాడు. సత్యం రెండు పకోడీలు నోట్లో వేసికొని నములుతూ అన్నాడు:

"హోటలొక్కటీ కిట్టుబాటు కావద్దూ?" - సారా వ్యాపారం ఎత్తేస్తే మాగతేమిటన్న అర్థం ఎక్కువగా స్ఫురించింది, రంగసామికి సత్యం మాటల్లో.

రంగసామి గట్టిగా నవ్వేశాడు.

"నువ్వు తెలివైన ఘటానివి సత్యం. అయినా యిప్పట్లో మూసెయ్యన్లే" రంగసామి మాటల్లో ఓ విధమైన భరోసా ఉంది.

"ఇప్పట్లో అంటే - నీ జీవితాంతం వరకూనా?" సత్యం కొంటెగా ప్రశ్నించాడు.

రంగసామి వేదాంతిలా అన్నాడు. "ఏమోలే, ఈ లోపుగా ప్రొహిబిషన్ వాళ్లకీ, నాకూ - ఏ పేచీలు రాకుండా ఉంటేను!"

పోలాయ్ రెండు సొట్టలు పడ్డ ఇత్తడి గ్లాసుల్తో టీ తీసికొచ్చి సత్యానికి, రంగసామికి ఇయిచ్చాడు. ప్లేటు ఖాళీ చేసి, టీ త్రాగేవరకూ సత్యం మరి మాట్లాడలేదు. చార్మినార్ సిగరెట్ ముట్టించి, జేబులోంచి ఓ అయిదు రూపాయల నోటు తీసిచ్చాడు రంగసామికి.

"ముష్టి మూడణాల కోసం, అంత నోటిస్తే నా దగ్గర చిల్లరుండొద్దూ! నీ దగ్గరే ఉంచు. తిరిగి వెళ్లేటప్పుడిద్దువుగానిలే!" అన్నాడు రంగసామి.

"ఈ రాత్రికి హోటలు తెరుస్తావా?" సత్యం అడిగాడు.

"ఏం అలా కొత్తగా అడుగుతున్నావ్?! ఏ రాత్రయినా రెండింటికి ముందు నా హోటలు కట్టేయ్యడం, ఎప్పుడైనా చూశావేమిటి?"

"అయితే ఆ నోటు నీ దగ్గరే ఉంచు. వెళ్ళగానే సరుకు దింపేస్తే, ఇక్కడకు తిరిగి వచ్చేటప్పటికి రాత్రి పదవుతుంది. ఎంత ఆలశ్యమైనా మరో రెండు గంటలు"

"మరి నీకు దారిలో డబ్బు అవసరమొస్తే?"

"ఉందిలే మరో నోటు. మళ్లా వారం పది రోజుల వరకూ, ఈ రూటు మీద రావడానికి వీలుపడదు. రాజమండ్రీ, ఏజన్సీల మధ్య తిరగవలసి వస్తుంది. ఈ రాత్రికి కాస్త మందేసుకొని మరీ పోతాను."

రంగసామి సంతోషంగా నోటు గల్లా పెట్లో పెడ్తూ, "రాత్రి బేరానికిదే బోణి!" అన్నాడు.

"మరి నే వస్తా" సత్యం లేచి పాక బయటకు వచ్చాడు. లారీ ఎక్కి, యింజన్ స్టార్ట్ చేశాడు. లారీ వంతెన దాటగానే కాస్త వేగం హెచ్చించాడు. సత్యానికొకడికే చాలా విసుగ్గా ఉంది ప్రయాణం. ఎప్పుడూ క్లీనర్ సుబ్బారావు కూడా ఉండడం వల్ల, ఏదో కాస్త ఊసు పోయేది వాడు చెప్పే కబుర్లతో. వాడికి జ్వరం రావడం మూలాన ఒంటరిగా బయలుదేర వలసి వచ్చింది సత్యంకు. 'లారీ ఫుల్ లోడ్‌లో ఉంది. ఏ టైరయినా పంక్చరయితే, నా పాట్లు దేముడి కెరుక!' అనుకొన్నాడు సత్యం.

రోడ్డు మీద అట్టే జనసంచారం లేదు. అప్పుడప్పుడూ, ఎదురుగా బస్సులు వస్తున్నాయి. రెండు మూడు చిన్న కార్లు వెనక నుంచి వచ్చి దూసుకొని పోయాయి. అంత వరకూ ఎండలో నల్లత్రాచులా మెరిసిన తారు రోడ్డు, ఆకాశంలో మబ్బులు పట్టడం మూలాన వెలవెల పోసాగింది. మధ్యాహ్నం బయలుదేరినప్పుడు ఎంతో ఎండగానూ, ఉక్కగానూ ఉంది. ఎండలో తారు రోడ్డు మీద పోతే, కళ్ల పోట్లు వస్తాయి. చినుకు పడకుండా మబ్బులేస్తే, కళ్లకి శ్రమ ఉండదు. సత్యానికిదే హాయిగా ఉంది.మబ్బులు మరింత దట్టంగా క్రమ్ముకోసాగాయి. సన్నటి జల్లు పడసాగింది.

చల్లటి నీటి తుంపరులు కిటికీలోంచి దూసుకొని మొహం మీద పడ్తోంటే ఎంతో హాయిగా, ఆహ్లాదంగా ఉంది సత్యానికి.

'పరుగెత్తే ప్రకృతి యింత అందంగా ఉన్న సమయంలో, మీనాక్షి తనతో ఉంటే ఎంత బావుండును?' - సత్యం మెదడులో ఆలోచనలు ముసురుకోసాగాయి.

అవును, మీనాక్షి తనంటే ప్రాణమిస్తుంది. ఈ సంగతి మొదట్లో తనకు తెలియదు. గంగరాజు కూతురు పార్వతంటే వెర్రెత్తి పోయేవాడు తను. పార్వతి కూడా చాలా యిష్ట పడింది. గంగరాజు కూడా సమ్మతించినట్లే. అయితే పార్వతి దగా చేసింది. తనలాగే, లారీ నడుపుకొంటున్న శేషగిరి, యజమానికి తెలియకుండా లౌక్యంగా చాలా డబ్బు గడించాడు. ఉన్న అయిదెకరాల పొలంలోనూ, ఓ ఎకరం పొలం అమ్మేసి, అదీ యిదీ కలిపి ఓ కొత్త కారు కొని, టాక్సీ నడపసాగాడు. కారు మోజులో పడిపోయింది పార్వతి. శేషగిరి పార్వతిని కట్టేసుకొన్నాడు. తను జన్మలో ఇంకెవర్నీ ప్రేమించకూడదనుకొన్నాడు. అన్నా, వదినా ఎన్నోసార్లు పెళ్లి సంగతి ఎత్తిచూశారు. 'నేను పెళ్లి చేసికోను వదినా! నా జీవితం యిలా గడిస్తే చాలు' అనేవాడు తను. అటువంటి తన జీవితంలో హఠాత్తుగా ఓ రోజున మీనాక్షి ప్రవేశించింది.

రాజమండ్రి బస్టాండ్‌లో గణపతి నవరాత్రుల సంబరాలు గొప్పగా జరుగుతాయి. ఆ చివరి రోజు రాత్రి, పందిరిలో జనం యిసుక వేస్తే రాలకుండా ఉన్నారు. మరో వీధి సంబరం బాణా సంచా కాల్పులతో, ఊరేగింపుతో అటువైపు కొచ్చింది. ఆ సంబరంలో వాళ్లు, కావాలని తారాజువ్వల్ని పందిరిలోకి వెయ్యడం ప్రారంభించారు. పందిరంతా గగ్గోలెత్తి పోయింది. ఆకతాయి కుర్రాళ్లు మెయిన్ ఆర్పేయడంతో, లైట్లన్నీ ఆరిపోయాయి. ఒక్కసారిగా పందిరిలో తొడతొక్కడయిపోయింది. మగవాళ్లకి వెనుకగా, ఆడవాళ్లకి ముందుగా ఓ స్థంభాన్ని ఆనుకొని, నిల్చున్న తన్ను ఎవరో వాటేసుకొన్నారు.

"ఎవరది?" అని ఆశ్చర్యంగా ప్రశ్నించాడు తను.

"నేను మీనాక్షిని, ఈ జనంలోంచి బయటకు తప్పించు" సమాధానం నెమ్మదిగా చెవిలో గొణిగింది, భయంగా. ఎంతో గర్వపడిపోయాడు తను. అతి ప్రయత్నం మీద ఆ తొడతొక్కిడిలోంచి తనూ, మీనాక్షీ బయటపడ్డారు. యింటి దాకా వెళ్ళి, దిగబెట్టి వచ్చాడు కూడా. మీనాక్షి పార్వతిలా అందగత్తె కాదు. రంగు కూడా నలుపే. అయినా మీనాక్షి అమాయకమైన కళ్లలోని ఆకర్షణ తనని బంధించసాగింది. తర్వాత్తర్వాత మీనాక్షి తనకి

మరింత సన్నిహితమవుతూ వచ్చింది. సంక్రాంతి పంట వచ్చిన తర్వాత యిద్దరికీ పెళ్లి చేసేస్తానన్నాడు మీనాక్షి తండ్రి.

సంక్రాంతి యింకా చాలా దూరం. త్వరగా వచ్చేస్తే ఎంత బావుండును!

తీయటి ఆలోచనలతో సత్యం లారీ వేగం బాగా హెచ్చించాడు. వర్షం కూడా ఎక్కువైంది. వర్షం ఎక్కువైందన్న సంగతి సత్యం గమనించినట్లు లేదు. ఉన్నట్టుండి ఒక్కసారిగా అదిరిపోయాడు సత్యం. ఆ క్షణంలో సత్యం స్థంభించిపోయాడు. తక్షణం తనేదో చెయ్యాలి. మెదడు విద్యుద్వేగంతో పని చేయసాగింది.

అక్కడ రోడ్డు సన్నంగా ఉంది. ఎడమపక్క దిగువగా ఏట్లోకి కోసుకుపోయిన గట్టు. గొడుగు కిందగా పట్టుకొని, యిద్దరు చిన్నపిల్లలు - ఓ అబ్బాయి, అమ్మాయి ఎదురుగా వస్తున్నారు. లారీ వాళ్లకి చాలా దగ్గరలో ఉంది. ఓ ఊదా రంగు చిన్న కారు కూడా చాలా వేగంగా ఎదురునించి వస్తోంది. వాడూ చూసుకొని డ్రైవ్ చేస్తున్నట్లు లేదు. ఎడమవైపుకి తనకు మరింత దారి లేదు. తను బ్రేకు వేసేలోగాకానీ, ఏట్లోకి వేరుదారిలేక తిన్నగా దారి తీసినా కానీ - పిల్లలిద్దరూ లారీ కింద పడడం కాయం. కుడివైపుకి తిరగాలి. చిన్న కారు ఢీకొడ్తుంది. ఆ కారులో ఎంతమందున్నారో? కారూ, లారీ దెబ్బ తిని తమందరూ గాయాలతో బయటపడవచ్చు. ఈ ఒక్క అవకాశం ఉంది ఇందులో. లేదా మరేదైనా జరగొచ్చు. జరిగినా ఆ కారు కలవాళ్లు భాగ్యవంతులు కాబట్టి, వాళ్ల వాళ్ల జీవితాలు నిరభ్యంతరంగా సాగిపోతాయి.

దైవం మీద భారం వేసి శక్తి కొద్దీ బ్రేకునొక్కుతూ స్టీరింగ్‌ని కుడివైపుకు తిప్పాడు. మరో క్షణంలో బ్రహ్మాండం బ్రద్దలయినట్లయింది. లారీ, వెనక చక్రాలు జారి, అంత బరువుతోనూ తల క్రిందులయి, రోడ్డుకు కుడి వైపు వాలులోకి పల్టీ కొట్టింది. చిన్న కారు తుక్కు తుక్కయిపోయింది.

చిన్నకారు డ్రైవరు, అందులో ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు, సత్యం - మొత్తం నలుగురు ఆ ప్రమాదానికి ఆహుతైపోయారు.

ఆ చిన్న కారు కొత్తది. విశాఖపట్టణంలో ఓ పెద్ద కంపెనీ మేనేజరుది. పాత కారమ్మేసి అంతకు రెండు నెలల క్రితమే ఈ కారు కొన్నాడు, పెళ్ళాం పట్టు పట్టడం వల్ల. నెల రోజులు సెలవు మీద కుటుంబంతో సహా డార్జిలింగ్ వెళ్లాడు, ఇంటి భారాన్ని తోటమాలి మీద వదిలి. డ్రైవరు రామచంద్రం పెళ్ళానికి నెలలు నిండాయి. ముసలి తల్లికి జబ్బు మళ్ళా తిరగబెట్టింది. తమ్ముడికి స్కూలు తెరిచారు. వాడికి మళ్ళా ఫీజులూ అవీ కట్టాలి. చేతిలో చిల్లిగవ్వ లేదు. వేరే గత్యంతరం లేకపోయింది. బేరం కుదిరితే తోటమాలికి కూడా ఏదో కాస్త ముట్టచెప్పడానికి ఒప్పుకొని, కారు తీసుకొని బస్‌స్టాండ్‌కు వెళ్ళాడు.

పరమేశం యూనివర్సిటీలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. తల్లిదండ్రులకు ఒక్కగా నొక్క కొడుకు. ఆ మర్నాటి సాయంత్రం ఏలూరులో అతని పెళ్లి జరగబోతోంది. కాకినాడలో ఉన్న తమ యింటికి పెళ్లికొడుకయిన తను తప్ప, మిగిలిన రావల్సిన

బంధువులందరూ వచ్చారు. తెల్లవారుజామున పెళ్లివారందరూ, రేణిగుంట ప్యాసింజర్‌లో ఏలూరు వెళ్ళారు. పరమేశానికి చివరిరోజు వరకూ సెలవు దొరకలేదు. ఆదరా బాదరాగా బట్టలూ అవీ సర్దుకొని స్టాండుకు వెళ్లేసరికి కాకినాడ బస్సు వెళ్లిపోయింది. రాత్రి వరకూ ట్రైను లేదు. ఆ రోజుకు మరింకో బస్సు లేదు. వీడ్కోలు చెప్పడానికి వచ్చిన స్నేహితుడితో మాట్లాడుతోంటే విని, రామచంద్రం కల్పించుకొని, 'నా టాక్సీలో రండి. మిమ్మల్ని చీకటి పడకుండా కాకినాడలో దింపేస్తా' అన్నాడు. చేతినిండా డబ్బు. అందులోనూ పెళ్ళి సంబరంలో ఉన్నాడాయెను. పరమేశానికి వంద రూపాయలెక్కువనిపించలేదు!

కొద్దిగా మాసిన పంచె కట్టుకొని,నలిగి పోయిన ఖద్దరు చొక్కా కట్టుకొన్న వెంకట్రామయ్య, పరమేశాన్ని భయపడుతూ అడిగాడు. "రేపు అమలాపురం కోర్టులో మా కేసు ఒకటి వాయిదాకుంది. దాయాదులతో, 'లిటిగేషన్'లో పడిపోయిన భూమి వ్యవహారం రేపు తీర్పు కొచ్చేస్తుంది. నేను కనక హాజరవకపోతే, కేసు కొట్టివేయబడే ప్రమాదముంది. పుట్టుగ్రుడ్డయిన కొడుకూ, పెళ్ళికెదిగిన కూతురూ ఏ ఆసరా లేకుండా పోతారు. మీకు పుణ్యముంటుంది. నన్ను కూడా కాకినాడ రానీయండి".

వెంకట్రామయ్య మాటల్లో కరుడుగట్టిపోయిన దైన్యం, పరమేశాన్ని చలింపచేసింది. "దానికేముందండీ మాష్టారూ, కాకినాడలో ఈ రాత్రి మా యింట్లో గడిపేసి, ఉదయమే మొదటి బస్సుకు కోటిపల్లి బయలుదేర్తే, అక్కణ్ణించి అమలాపురం ఎనిమిదింటికల్లా వెళ్ళిపోవచ్చు"

★ ★ ★

ఒళ్లు దగ్గర పెట్టుకోకుండా డ్రైవింగ్ చేసి యిందరి జీవితాలు నాశనం చేశారు మీరిద్దరూ!" పరమేశం, వెంకట్రామయ్యా కోపంగా అరుస్తూ విశ్వంలోకి ఎటో పోయారు. రామచంద్రం తనది కూడా కొంత తప్పు ఉన్నట్లు ఒప్పుకొని, క్షమించమంటూ ఎటో తేలిపోయాడు.

"శని మొహాల్లారా! మీరు ఆ లారీ కింద పడి చచ్చినా బాగుండేది, పీడా వదిలేది!" సవతితల్లి యిద్దరి పిల్లల్నీ చీపురు పుచ్చుకొని బాదుతోంది. నల్లమందు మత్తులో జోగుతున్న తండ్రికి, ఈ ప్రపంచంతో సంబంధమే లేదు.

గాలిలో తేలుతున్న సత్యం దద్దరిల్లిపోయాడు.

'ఛా! తను లారీని తిన్నగా పోనిస్తే. అభాగ్యులైన యిద్దరు పిల్లల్ని జీవితపు చెరసాల నుండి తప్పించి, తను జైలు శిక్ష ననుభవించేవాడు'.

క్షోభిస్తున్న సత్యం ఆత్మ గాఢాంధకారమైన అనంతంలో, శూన్యంలో, గమ్యం లేనివైపు తేలిపోసాగింది.

సత్యం ఆత్మశాంతి కోసం, సత్యానికి యివ్వవలసిన డబ్బు విలువ గల సారాతో, ఓ యిద్దరు వ్యక్తుల్ని తృప్తిపరచాడు రంగస్వామి.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక : 24-12-65)